క్లుప్తంగా

వేతనాలు ఇవ్వండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో సెక్యూరిటీ సిబ్బంది వేతనాలు వెంటనే చెల్లించాలని ఎస్ఐఎస్ఎఫ్ సంఘం రాష్ట్ర నాయకులు రాము పేర్కొన్నారు. సిబ్బందితో కలిసి బుధవారం పీయూలో నిరసన చేపట్టారు. ఏజెన్సీ నిర్లక్ష్యమే కారణమని అన్నారు. విషయం వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

అక్షింతల వితరణ



బాలానగర్: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం సీతారాముల అక్షింత వితరణ విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తల సమక్షంలో నిర్వహించారు. ప్రతి గ్రామంలో డిసెంబర్ 30న అంక్షితల వితరణ మహోత్సవం నిర్వహించాలని అందుకోసం కమిటీలు ఏర్పాటు చేసుకోవాలనిసూచించారు.

వార్షికోత్సవ పూజలు

నవాబుపేట: మండల పరిధిలొని కొల్లూర్‌లో చిన్నయ్యస్వామి సమాధి చెంత వార్షికోత్సవ పూజ ప్రారంభించినట్లు ఆలయ పీఠాధిపతి నందీశ్వర గురుస్వామి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గోపూజతో కార్యక్రమం నిర్వహించారు. నెలరోజుల ఉత్సవాలు ఉంటాయన్నారు.

పథకాలపై అవగాహన

హన్వాడ: గుడ్డిమల్కాపూర్, దాచక్‌పల్లి గ్రామాల్లో బుధవారం సబ్‌కా వికాస్ ... భారత్ వికాస్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. భారత్ అభివృద్ధికి పాటుపడదామని ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్‌లు బాలాగౌడ్, బాలకిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

అడ్డాకుల: కందూర్‌కి చెందిన కటికె శ్రీనివాసులు మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్, బీజేపీ నాయకులు వేర్వేరుగా పరామర్శించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీహరి రూ.5వేలు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ రూ.5వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. అదే గ్రామానికి చెందిన మణెమ్మ మృతి చెందడంతో కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కొత్త శ్రీను రెండు బాధిత కుటుంబాలకు రూ.2వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

చిన్నచింతకుంట: అప్పంపల్లి గ్రామంలో కటికె రమిజ బుధవారం మృతి చెందగా కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రమిజ మృతదేహానికి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ. పదివేలు ఆర్థికసాయం చేశారు. సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

క్రషర్ మిషన్‌తో ఇబ్బందులు

నవాబుపేట: పంట పొలాల మధ్య క్రషర్ మిషన్‌తో ఇబ్బందులు కలుగుతున్నాయని చౌడూర్ గ్రామస్తులు, రైతులు తహసీల్దార్ మల్లికార్జున్ రావుకు బుధవారం వినతిపత్రం అందించారు. మంగళవారం క్రషర్ యజమానులు అక్కడ నిషేధిత మందుగుండు నిల్వ చేయగా ఓ కుక్క దాన్ని కొరికిందని.. తలపేలి మృతి చెందిందని పేర్కొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ మైనింగ్ అధికారులకు, కలెక్టర్‌కు వివరిస్తానని వారి ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని వివరించారు. మల్లేష్, భీమయ్య, ఆంజనేయులు, బాల్‌రాజ్, అమరేష్, గోపాల్ ఉన్నారు.

నాణ్యమైన భోజనమేది?

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని వివిధ హాస్టళ్లలో ఉన్న వివిధ హాస్టళ్లలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎంఎస్ఎఫ్ నాయకుడు కమలాకర్ పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకుండా నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. దేవరాజు, శ్రీను, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ

పాలమూరు: మెడికల్ రిప్రజెంటేటివ్స్ సమస్యలు పరిష్కారించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని.. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్1976ను పునరుద్ధరించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ అన్నారు. తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్ హాల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నాలో పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి కురుమూర్తి పాల్గొన్నారు.



ఎన్నికలకు సిద్ధంకండి



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ రవినాయక్, ఇతర అధికారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పార్లమెంటు ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటి నుంచే సిద్ధ చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్వోలతో పార్లమెంటు ఎన్నికల సంసిద్ధతపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. శాసనసభ ఎన్నికల మాదిరిగా రాబోయే పార్లమెంటు ఎన్నికలకు సైతం ప్రణాళికను రూపొందించాలని అన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలను ఓపీఓలుగా వినియోగించుకునేందుకు తక్షణమే వారి డేటాను సేకరించాలని తెలిపారు. సెక్టోరల్ అధికారులను గుర్తించి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇప్పటి నుంచే వీడియో సర్వేలెన్సు బృందాల గుర్తింపు, ఆయా సెగ్మెంట్ల వారీగా సహాయ వ్యయ పరిశీలకుల నియామకం చేపట్టాలని సూచించారు. 9 పాయింట్లకు సంబంధించి డిసెంబర్ 31వ తేదీలోగా పూర్తి చర్యలు చేపట్టాలన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా స్వీకరించి పెండింగ్‌లో ఉన్న అన్ని ఫాం వెంటనే పరిష్కరించాలని అన్నారు. పార్లమెంటు ఎన్నికల రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటుపై ఆరా తీశారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా నవంబర్ 1 నుంచి డిసెంబర్ 10 వరకు వచ్చిన అన్ని రకాల ఫారాలను ఈ నెల 25 నాటికి పరిష్కరిస్తామని కలెక్టర్ రవినాయక్ తెలిపారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 1899, జడ్చర్లలో 1789, దేవరకద్రలో 1000 ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయని వీటన్నింటిని పరిష్కరించే చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్‌డీఓ అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



అడ్డాకుల: మండల కేంద్రంలో బుధవారం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. డీసీసీ కార్యదర్శి గంగుల విజయమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఖాజామైనోద్దీన్ సహకారంతో ఏర్పాటు చేసినపోటీలను స్థానిక నాయకులు ప్రారంభించారు. 40 జట్లు పాల్గొంటున్న పోటీలను ఈనెల 30 వరకు నిర్వహించనున్నారు. జితేందర్‌రెడ్డి, భీమన్న యాదవ్, షఫీ అహ్మద్, ఖాజామైనోద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్ సాగర్, శేఖర్‌రెడ్డి, నాగరాజు ఉన్నారు.

వివాహానికి ఎమ్మెల్యేసాయం



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని 14వ వార్డులో ఉంటున్న హైమావతి కుమార్తె వివాహం కోసం స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు బుధవారం నాయకులు వంశీకృష్ణ, ఆనంద్, లక్ష్మమ్మ, రాజు, తుంగ రఘు తదితరులు మహిళ ఇంటికి వెళ్లి నగదును అందించారు.

దైవ మార్గంలో సాగుదాం



వేడుకల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: దేవుడు చూపిన మార్గంలో అందరం ముందుకు సాగుదామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం సద్దల్‌గుండులో రక్షణ దుర్గం, జీసస్ పవర్ అపోస్టలిక్ మినిస్ట్రీస్ ప్రాంగణంలో పాస్టర్ దాసరి సామ్యేల్ నిర్వహణలో దాసరి సుందర్ అధ్యక్షతన ఉమ్మడి జిల్లాల పాస్టర్లు, దైవ సేవకుల వేదికగా జరిగిన ఐక్య క్రిస్మస్ వేడుకల్లో ఆయన మంగళవారం రాత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాస్టర్ పీఏ.దేవదాస్ ప్రార్థనలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ రెవరెండ్ బాలుభాగ్యరాజ్ దైవ సందేశం ఇచ్చారు. ఏసుక్రీస్తు జననం ప్రాముఖ్యత తదితర విషయాలపై ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతిదూతగా వచ్చిన యేసు ప్రపంచానికి సందేశం అందించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మీరందరూ ప్రార్థించాలన్నారు. అదేవిధంగా మైనార్టీలకు ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక నెరవేరుస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ రాబర్ట్‌వెస్లీ, దాసరి సుందర్, డీఆర్‌వీ ప్రసాదరావు, ఆర్.జాన్, ప్రేమ్‌రాజ్, విజయభాస్కర్, శ్రీకాంత్, ఆర్.ప్రసాద్, తిమోతి, ప్రకాశ్, ఎంఐ.జాన్, హన్మంతురావు, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ రవీందర్‌పై ఫిర్యాదు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డీఈఓ రవీందర్‌పై తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు భరత్ మాట్లాడుతూ గతంలో పలు అక్రమాల విషయంలో డీఈఓపై కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. కాగా ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని పలువురితో ఆయన రాయబారం పంపినా పట్టించుకోకపోవడంతో.. డబ్బులు ఇవ్వాలని అడిగినట్లు తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు.

జడ్చర్లలో మద్యం దుకాణం లొల్లి

జడ్చర్ల: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఓ మద్యం దుకాణం లొల్లి ఉద్రిక్తతకు దారితీసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మద్యం దుకాణాన్ని నిర్వహించుకునేందుకు లైసెన్స్ హోల్డర్‌కు దుకాణాన్ని అద్దెకు ఇచ్చిన యజమానులు మరో హోల్డర్‌కు కూడా అదే దుకాణం విషయంలో.. అదే రకమైన అగ్రిమెంట్ చేసుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. ఈనెలలో కొత్తగా మద్యం దుకాణాలను ప్రారంభించిన సమయంలోనే .. కొత్తగా అగ్రిమెంట్ చేసుకుని దుకాణాన్ని కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొంటుండగ, తమకు కూడా ఇదే దుకాణాన్ని ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నామని ప్రత్యర్థి లైసెన్స్ నిర్వాహకులు వాదించారు. ఘటనలో దుకాణం తాళాలను కూడా పగులగొట్టడంతో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ బాలాజీ దుకాణం దగ్గరకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

జీపు, ఆటో డ్రైవర్ల నిరసన



దేవరకద్ర: పట్టణంలో ఆటో, జీపు డ్రైవర్లు బుధవారం నిరసన తెలిపారు. బుధవారం జీపులను, ఆటోలను కొత్త బస్టాండ్ ఆవరణలో నిలిపివేసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలు చేయడం వల్ల ఆటోలు, జీపులు నడవక బతుకు తెరువు లేకుండా పోయిందని ఆరోపించారు. ఉచిత ప్రయాణం రద్దుచేయాలని.. లేనిచో తమకు జీవన భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు శ్రీకాంత్‌యాదవ్, రాము, భవానీసింగ్, పాల్గొన్నారు.

ఫిర్యాదుపై అధికారుల క్షేత్రస్థాయి విచారణ

రాజాపూర్: దొండ్లపల్లి శివారులోని సర్వే నెంబర్156లో దళితుల శ్మశానవాటికను ఆక్రమించారని రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌తో పాటు, కలెక్టర్‌కు ఇప్పటూర్‌కి చెందిన కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటరెడ్డి క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. సర్వే నెంబర్ 156లో కత్తెర సత్యమ్మ పేర 12.26 పట్టాభూమి ఉన్నదని పేర్కొన్నారు. గతంలో కూడా సర్వే జరిపి హద్దురాళ్లు పాతారని తహసీల్దార్ పేర్కొన్నారు. కాగా కావాలనే కొందరు తప్పుడు కేసులు పెడుతున్నారని సత్యమ్మ కుమారుడు కత్తెర కృష్ణయ్య వివరించారు. వారిపై కలెక్టర్‌కు, అధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ

మిడ్జిల్: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ పంచాయతి ట్రాక్టర్‌తోపాటు మరో ముగ్గురికి సంబంధించిన ట్రాక్టర్ల బాట్యరీలు చోరీ చేశారు. బుధవారం ఉదయం పంచాయతీ సిబ్బంది గమనించి సర్పంచ్ రాధిక దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

ప్రధాన కార్యదర్శిగా సీతారాం

చిన్నచింతకుంట: చిన్నవడ్డేమాన్‌కు చెందిన సీతారాంను బుధవారం మహబూబ్‌నగర్‌లో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

మిడ్జిల్: వెలుగొమ్ముల, అయ్యవారిపల్లి, చిల్వేర్ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ నాయకులు బుధవారం కల్వకుర్తి డీఎంకు వినతి పత్రం అందజేశారు. చిల్వేర్ ఎంపీటీసీ రాజారెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, విజయ్, సత్యం, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

బీసీ-ఏలో చేర్చాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ముదిరాజ్‌లను బీసీ-ఏ లోకి మార్చాలని కోరుతూ రాష్ట్ర ముదిరాజ్ చైతన్యసేన ఆధ్వర్యంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు దోమ పరమేశ్వర్, ప్రధానకార్యదర్శి కుమార్, వర్గగణేశ్, రాములు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు అవగాహన

గండీడ్: గ్రామాల్లో అర్హులయిన వారు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవాలని అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్ కృష్ణారెడ్డి, జీహెచ్‌ఎం రాజేష్ రాథోడ్, శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ ఇంతియాజ్, ఆర్ఐలు రాఘవేందర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంటలను కాపాడుకోవాలి

రాజాపూర్: రైతులు వేరుశనగ పంటను పొగాకు లద్దెపురుగు నుంచి కాపాడుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్ పేర్కొన్నారు. బుధవారం ఈద్గానిపల్లిలో పంటలను పరిశీలించి సూచనలు చేశారు. ఏఈఓ ఆంజనేయులు రైతులు హన్మ, రఘు ఉన్నారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



జడ్చర్ల టౌన్: గంగాపురం లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా జనవరి 15 వరకు ప్రతిరోజు తెల్లవారుజామున 5గంటలకు సుప్రభాతం, భగవరాధన, తిరుప్పావై అనుసంధానం నివేదన, తీర్థప్రసాద వితరణ చేయనున్నారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు నిత్యపూజాకార్యక్రమాలు యధావిధిగా నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి దీప్తిరెడ్డి తెలియజేశారు. ఈనెల 23న ముక్కోటి ఏకాదశి వేడుకలు, 24 నుంచి మూడు రోజుల పాటు అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. మొదటిరోజు నిత్యపూజలతోపాటు సాయంత్రం అధ్యయనోత్స తొళక్కం ప్రారంభించనున్నారు. తరువాత తిరువాయిముజి సేవాకాలం నివేదన, హారతి, 25న ఉదయం 7గంటలకు ప్రాభోధకి (బాలభోగం), హారతి, తీర్థప్రసాద గోష్ఠి తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఇళ్లు నిర్మించి ఇచ్చిన నాయకులు



నవాబుపేట: ఎన్నికలలో ప్రచార సమయంలో ఇచ్చిన మాట ప్రకారం.. కారుకొండకు చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు భూపాల్‌రెడ్డి గ్రామంలో ఇళ్లు నిర్మించి మంగళి రామస్వామికి అనే వ్యక్తి బుధవారం అప్పగించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం సందర్భంగా చిన్నగది లాంటి ఇంట్లో ఉంటున్ననని రామస్వామి చెప్పగా భూపాల్‌రెడ్డి ఆయనకు మాట ఇచ్చాడు. తాజాగా మాట నిలబెట్టుకోవడంతో రామస్వామి కొత్త ఇంట్లోకి వెళ్లాడు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డిని పలువురు అభినందించారు.

కాకర్లపహాడ్ లో విద్యార్థుల ఎన్నికలు



నవాబుపేట: కాకర్లపహాడ్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం తరగతి గదులకు, పాఠశాలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. సాధారణంగా జరిగే ఎన్నికల తరహాలో కార్యక్రమం నిర్వహించారు. తరగతి గది నాయకుడికి తెల్ల బ్యాలెట్, పాఠశాల నాయకుడికి పింక్ కలర్ బ్యాలెట్ ఏర్పాటు చేసి గుర్తులు సైతం ముద్రించారు. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు చేసి విజేతలను ప్రకటించారు. దీంతో విజయం సాధించిన వారు ఊరేగింపులు నిర్వహించారు. ఎన్నికలపై అవగాహన కల్పించడం కోసం కార్యక్రమం చేపట్టినట్లు ఉపాధ్యాయ బృందం తెలిపింది. హెచ్‌ఎం శ్రీనివాస్, ఎన్నికల అధికారి విజయ్‌కుమార్, క్లస్టర్ హెచ్‌ఎం దశరథ్ నాయక్ ఉన్నారు.

కొనసాగుతున్న 'అప్‌డేట్' కష్టాలు



అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో ఆధార్ అప్‌డేట్ కష్టాలు తీరడం లేదు. అడ్డాకులలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్న ఆధార్ కేంద్రం వద్ద నిత్యం రద్దీ కనిపిస్తోంది. రెండు, మూడు నెలలుగా బ్యాంకు వద్ద ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలు బారులు తీరుతున్నారు. అడ్డాకులలో ఉన్న మీసేవ కేంద్రంలో రెండు, మూడేళ్లుగా ఆధార్ కేంద్రం పని చేయడం లేదు. దీనివల్ల మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఆధార్ అప్‌డేట్ కోసం బ్యాంకులో ఉన్న ఆధార్ కేంద్రానికి వస్తున్నారు. ఇక మూసాపేట మండలంలో జానంపేట, మూసాపేటలో రెండు మీసేవ కేంద్రాలు ఉన్నా వాటిలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీనివల్ల మూసాపేట మండలానికి చెందిన ప్రజలు కూడా అడ్డాకుల బ్యాంకు వద్దకే రావడంతో రెండు మండలాల ప్రజలతో బ్యాంకు వద్ద జనం కిక్కిరిపోతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు



పోల్కంపల్లి విద్యార్థులు



మౌనిక

రాజాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మౌనిక రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ంది. దీంతో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బచ్చిరెడ్డి, హెచ్‌ఎం ఆనంద్‌కుమార్, పీజికల్ డైరెక్టర్ వడ్డన్న బుధవారం ఆమెను అభినందించారు. మౌనిక ఈనెల 23 నుంచి హన్మకొండలో జరిగే పోటీల్లో పోటీల్లో పాల్గొననుంది.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు పొల్కంపల్లి విద్యార్థులు

అడ్డాకుల: పోల్కంపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎం.శివకుమార్, ధర్మతేజలను హెచ్‌ఎం నాగయ్య, పీఈటీ నిరంజన్‌రావు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

క్రికెట్ పోటీలకు రిషి కళాశాల విద్యార్థిని..



విద్యార్థిని ఫిర్దోస్ తస్నీమ్‌కు సన్మానం

మహబూబ్‌నగర్ క్రీడలు: ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో ఈనెల 23 నుంచి జరిగే 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ పోటీలకు జిల్లా కేంద్రంలోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థిని ఫిర్దోస్ తస్నిమ్ ఎంపికైంది. విద్యార్థిని కళాశాల సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు బుధవారం అభినందించి సన్మానం చేశారు. కార్యక్రమంలో జాతీయ క్రీడాకారుడు అద్నాన్, విద్యార్థిని తండ్రి రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.